పరిహారం.. పరిహాసం

- రాజోలి మండలంలో పదుల సంఖ్యలో కూలిన ఇళ్లు
- పరిహారం ఇచ్చింది ఏడుగురికే..
- కూలిన ఇళ్లపై క్షేత్ర స్థాయిలో విచారణ కరువు



గత నెలలో అధిక వర్షాలకు కూలిన ఇల్లు

రాజోలి: గత నెలలో కురిసిన వర్షాలకు మండలంలో పాత ఇళ్లు, మిద్దెలు నేలకూలాయి. కూలిన ఇళ్లకు తాత్కాలికంగా పరిహారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. దెబ్బతిన్న, కూలిన ఇంటికి రూ.16,500ల చొప్పున అందించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. కూలిన ఇంటి యజమానులు దరఖాస్తు చేసుకోవాలని, వారి వివరాలు అందించాలని అధికారులు చెప్పారు. కానీ ఆ విషయం గ్రామాల్లో మాత్రం తెలియదు. మండలంలోని చాలా చోట్ల వర్షాలకు ఇళ్లు నేలకూలాయి. పరిహారం అందింది మాత్రం ఏడుగురికే. ఈ విషయం ఇప్పుడిప్పుడే తెలుస్తుండటంతో తాము దరఖాస్తు చేసుకోలేకపోయమని బాధితులు ఆవేదన చెందుతున్నారు.

క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ లేక..

అధిక వర్షాల కారణంగా మండల కేంద్రంతో పాటు మాన్‌దొడ్డి, తుమ్మిళ్ల, పచ్చర్ల, ముండ్లదిన్నె గ్రామాల్లో పాత మిద్దెలు నేలకూలాయి. మరి కొన్ని పాక్షికంగా దెబ్బతిన్నాయి. మొత్తం మీద ఎన్ని ఇళ్లు నేలకూలాయో పూర్తి సమాచారం జిల్లా అధికారులు చేపట్టలేదు. పరిహారం అందించాలనుకునేటప్పుడు నష్టపోయిన వారు దరఖాస్తు చేసుకోవాలని గ్రామాల్లో ఎవరికీ చెప్పలేదు. దీంతో చాలా మంది బాధితులు దరఖాస్తు చేసుకోలేదు. మండలంలో పదుల సంఖ్యలో ఇళ్లు నేలకూలితే మాన్‌దొడ్డిలో 2, ముండ్లదిన్నెలో 3, పచ్చర్ల1, తూర్పుగార్లపాడులో1 మొత్తం ఏడుగురికి మాత్రమే పరిహారం అందించించారు.

ఈ విషయం తెలియదు..



గతంలో విపత్తులు వచ్చినప్పుడు ప్రభుత్వం నుంచి అందే సహాయానికి సమయం ఉండేది. ప్రస్తుతం పరిహారం కోసం ఎవరికి సమాచారమిచ్చారనే విషయం కూడా గ్రామాల్లో తెలియదు. పరిహారం అందుతుందని, వారు దరఖాస్తు చేసుకోవాలని ఎవరూ చెప్పలేదు. ఎవరికీ తెలపకుండా ప్రభుత్వం పరిహారం అందిస్తే దాని వల్ల క్షేత్ర స్థాయిలో ప్రయోజనం ఎలా అందుతుంది.

– పి.మోహన్, తూర్పుగార్లపాడు

జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తాం..



గత నెలలో అధిక వర్షాలకు మండలంలో పలు చోట్ల ఇళ్లు దెబ్బతినడంతో అప్పుడున్న అధికారులకు అందిన దరఖాస్తుల మేరకు రూ.16,500ల చొప్పున పరిహారం అందింది. ప్రభుత్వం, జిల్లా అధికారుల ఆదేశాల మేరకు దరఖాస్తుల గడువు ముగిసేలోగా దరఖాస్తు చేసుకోవాలి. మండలంలో ఇంకా ఇళ్లు కూలిన ఉన్నారని తెలిసింది. వారి విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– రామ్మోహన్, తహసీల్దార్, రాజోలి

క్లుప్తంగా

మున్సిపల్ కమిషనర్ బదిలీ

శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి జడ్చర్ల మున్సిపాలిటీకి బదిలీ అయినట్లు ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిషోర్ శనివారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో జడ్చర్ల కమిషనర్ రాజయ్యను వడ్డేపల్లి మున్సిపాలిటీకి బదిలీ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

29న సీఎం కప్ క్రీడలు ప్రారంభం

అలంపూర్ రూరల్: అలంపూర్ మున్సిపాలిటీ పరిధిలోని మాంటిస్సోరి పాఠశాలలో ఈ నెల 29న సీఎం కప్ క్రీడలు ప్రారంభిస్తున్నట్లు ఎంపీడీఓ పద్మావతి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సీఎం కప్ క్రీడలను నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఇందులో ఖోఖో, వాలీబాల్, క్రికెట్, కబడ్డీ, ఫుట్‌బాల్ అథ్లెటిక్స్ క్రీడలకు సంబంధించి గ్రామాల వారీగా ఎంపిక చేసినట్లు తెలిపారు. ఇందులో గెలిచిన క్రీడకారులను జిల్లా టీంకు ఎంపిక చేయనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



కేటీదొడ్డి: అండర్–17 బాలుర వాలీబాల్ పోటీలకు కేటీదొడ్డి మండలంలోని పాతపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి మధు పెద్దపల్లి జిల్లాలోని గోదావరిఖనిలో ఈ నెల 28 నుంచి 30 వరకు నిర్వహిస్తున్న స్టేట్‌మీట్ రాష్ట్ర స్థాయిలో పాల్గొంటాడని పీటీ మోహన్ మురళి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా చంద్రసేనారెడ్డి, ఉపాధ్యాయ బృందం, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు ప్రజలు విద్యార్థిని అభినందించారు.

క్రాస్ కంట్రీ అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

గద్వాలటౌన్: కర్ణాటకలోని మంగళూర్ యూనివర్సిటీలో జరిగే సౌత్‌జోన్ ఆలిండియా అంతర్రాష్ట్ర విశ్వవిద్యాలయాల అథ్లెటిక్స్ పోటీలకు గద్వాలకు చెందిన ముగ్గురు డిగ్రీ విద్యార్థులు ఎంపికయ్యారు. పురుషుల విభాగంలో బీఏ ఫైనల్ ఇయర్ విద్యార్థి అశోక్, బీఎస్సీ ఫైనల్ ఇయర్ హరికృష్ణలు ఎంపికయ్యారు. మహిళల విభాగంలో బీకాం ఫైనల్ ఇయర్ జయలక్ష్మి ఎంపికైంది. వీరు క్రాస్‌కంట్రీ పది కిలోమీటర్ల పరుగు పందెంలో పాలమూరు యూనివర్సిటీ తరుపున పాల్గొంటారు. విద్యార్థుల ఎంపికపై కళాశాల ప్రిన్సిపల్ షేక్ కలందర్ బాషా, వైస్ ప్రిన్సిపల్ చంద్రమోహన్, ఇన్‌చార్జి ఫిజికల్ డైరెక్టర్ కరుణాకర్ హర్షం వ్యక్తం చేశారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలి



అయిజ: విద్యార్థులకు ఇవ్వాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు వెంటనే ఇవ్వాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో ఏబీవీపీ నాయకులు రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ గణేష్ మాట్లాడారు. విద్యార్థులకు వెంటనే న్యాయం చేయకుంటే నిరసన కార్యక్రమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

లారీని ఢీ కొట్టిన కారు: ఒకరికి గాయాలు

ఉండవెల్లి: మండలంలోని జాతీయ రహదారిపై ఇటిక్యాలపాడు ఘర్ దాబా సమీపంలో ఆగి ఉన్న లారీని కారు ఢీ కొట్టడంతో ఒకరికి గాయాలైన సంఘటన శనివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. శనివారం తెల్లవారు జామున కడప నుంచి హైదరాబాద్‌కు కారులో ముగ్గురు వెళ్తున్నారు. ఈ క్రమంలో నిద్రమత్తులో ఆగి ఉన్న లారీని ఢీకొట్టారు. దీంతో కారులో కృష్ణారెడ్డి తలకు గాయాలు కావడంతో 108లో కర్నూల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. మిగతా ఇద్దరికి ఎలాంటి గాయాలు కాలేదు. హైవే సిబ్బంది వాహనాలను అదుపు చేశారు.



బాల్య వివాహాలు చేయొద్దు

- డీడబ్ల్యూఓ సుధారాణి



మాట్లాడుతున్న డీడబ్ల్యూఓ సుధారాణి

గద్వాల అర్బన్: ఆడపిల్లలకు చిన్న వయస్సులో వివాహాలు చేసి ఇబ్బందులకు గురి చేయొద్దని డీడబ్ల్యూఓ సుధారాణి అన్నారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా శనివారం జిల్లా కేంద్రంలోని బాలసదనంలో 'బేటీ బచావో–బేటీ పడావో' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్లలపై ఉండే వివక్ష, హింస, బాల్య వివాహాల వల్ల జరిగే నష్టాలపై విద్యార్థినులు అవగాహన కలిగి ఉండాలన్నారు. బాల్యవివాహాలు, ఆడపిల్లల విక్రయం చట్టరీత్యా నేరమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆడపిల్లల కోసం అనేక చట్టాలు తీసుకొచ్చాయని, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయన్నారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ జిల్లా మహిళా సాధికారత, బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ చైర్మన్ సహదేవుడు, మెంబర్లు జయభారతి, డీసీపీఓ నర్సింహ, కౌన్సిలర్ సురేష్, కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

పౌష్టికాహారం అందించాలి

- జిల్లా సంక్షేమ అధికారి సుధారాణి



తాటికుంటలో మాట్లాడుతున్న జిల్లా సంక్షేమ అధికారి సుధారాణి

మల్దకల్: గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించి వారి ఆరోగ్యంపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి సుధారాణి అంగన్‌వాడీ టీచర్లను ఆదేశించారు. శనివారం మండలంలోని తాటికుంట గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. బాల్య వివాహాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. నెలనెలా క్రమం తప్పకుండా వైద్యులను సంప్రదించి ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న బాలామృతంను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ నాగరాణి, జయన్న, నవీన్‌కుమార్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్, టీచర్లు పాల్గొన్నారు.

మరో పోరాటానికి సిద్ధం కావాలి



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ పోగుల రాజేష్

గద్వాల అర్బన్: ఎస్సీ వర్గీకరణను అమలు చేయకుండా కమిటీల పేరుతో కాలయాపన చేస్తూ మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నాయకులు మరో పోరాటానికి సిద్ధం కావాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ పోగుల రాజేష్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును సీఎం రేవంత్‌రెడ్డి దేశంలో మొట్టమొదటిగా తెలంగాణలోనే వర్గీకరణ చేస్తామని అసెంబ్లీలో ప్రకటించి మాట తప్పారని మండిపడ్డారు. దీనిని నిరసిస్తూ ఈనెల 30న మహబూబ్‌నగర్ జిల్లాలోని జడ్చర్లలో ధర్మయుద్ధం పేరుతో మహాసభను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సభకు జిల్లా నుంచి అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ కో కన్వీనర్ పరుశరామ్, నాయకులు మోషన్న, కన్న, ఆంజనేయులు, ఏసన్న, తిమ్మన్న, రంజిత్‌కుమార్ ఉన్నారు.

విద్యార్థులకు సమాజ సేవపై అవగాహన



ఎర్రవల్లిలో వివిధ వృత్తుల వేషధారణలో చిన్నారులు

ఎర్రవల్లి: మండల కేంద్రంలోని సరస్వతి పాఠశాలలో శనివారం సమాజ సేవపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు వివిధ వృత్తుల వేషధారణలో అలరించారు. అనంతరం చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ జీవితంలో ప్రతి పనిముట్టు అవసరం ఉంటుందని, ప్రతి ఒక్కరిని మనం గౌరవించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం మధులికరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ప్రసన్న లక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



దుకాణ యజమానులతో మాట్లాడుతున్న సీఐ రవిబాబు

ఉండవెల్లి: దుకాణ యజమానులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సీఐ రవిబాబు, ఎస్ఐ మహేష్‌లు శనివారం మండలంలోని అలంపూర్ చౌరస్తాలో అవగాహన కల్పించారు. అలంపూర్ చౌరస్తాలోని ప్రతి దుకాణంలో సీసీ కెమెరా ఏర్పాటు చేసుకుని, దొంగలను కట్టడి చేయాలన్నారు. ఇప్పటికే చాలా సార్లు దొంగలు హల్‌చల్ చేశారన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే దొంగల భయం లేకుండా ఉండొచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది రవి, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

బాలిక మృతి కారకులను శిక్షించాలి

గద్వాలటౌన్: బాలిక ఆత్మహత్యకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ రామంజనేయులు డిమాండ్ చేశారు. శనివారం డీకే బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. మల్దకల్ మండలం బిజ్వారం గ్రామానికి చెందిన బాలికపై సీడ్ ఆర్గనైజర్ బండ్ల రాజశేఖర్‌రెడ్డి దొంగతనం నెపం ఆపాదించడంతో పాటు పోలీస్ స్టేషన్‌కు పిలిపించి విచారణ పేరుతో వేధించారని ఆరోపించారు. అవమానం భరించలేక బాలిక ఆత్మహత్యకు పాల్పడిందని తెలిపారు. రెండు నెలల క్రితం గద్వాలలో దొంగతనం జరిగితే, ఈ నెల 11న మల్దకల్‌లో ఫిర్యాదు చేయడం ఏమిటని ప్రశ్నించారు. పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబ సభ్యులను రాజకీయ ఒత్తిళ్లతో బెదిరింపులకు పాల్పడుతూ కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారన్నారు. తక్షణమే సీడ్ ఆర్గనైజర్‌పై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో బీజేపీ తరుపున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో నర్సింహులు, దేవదాసు, అనిల్‌కుమార్, కృష్ణ, ఆసీఫ్, మోహన్‌రెడ్డి ఉన్నారు.

అయ్యప్ప స్వామి ఆలయానికి విరాళం



అయిజ: అయ్యప్ప భక్తులు నిర్మించతలపెట్టిన అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి మండలంలోని సంకాపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు రాముడు రూ.50 వేలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు ఉమామహేష్, భాస్కర్ రావు, మద్దిలేటి, వీరేశ్ గౌడ్, గజేంద్ర, శివ, తరుణ్ పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాలు పంపిణీ



మానవపాడు: మండల కేంద్రంలోని మండల వనరుల కేంద్రంలో శనివారం ఎంఈఓ శివప్రసాద్ పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు–2ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

4న బొడ్రాయి ప్రతిష్ఠ వార్షికోత్సవ పూజ



అమరచింత: పట్టణంలో నవంబర్ 4న బొడ్రాయి ప్రతిష్ఠాపన వార్షికోత్సవ పూజ నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు నాగభూషణంగౌడ్, తాటికొండ రమేష్, కృష్ణమూర్తిలు తెలిపారు. పట్టణంలోని మార్కండేయ ఆలయంలో శనివారం సమావేశం నిర్వహించి పూజ కార్యక్రమాల తేదీలను నిర్ణయించారు.

అలంపూర్‌లో ట్రెయినీ కలెక్టర్ల పర్యటన



జెడ్పీహెచ్ఎస్‌లో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ట్రెయినీ కలెక్టర్లు

అలంపూర్ రూరల్: అలంపూర్ పట్టణంలో శనివారం ట్రెయినీ కలెక్టర్ల బృంద పర్యటించింది. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో వార్డు అధికారులతో ట్రెయినీ కలెక్టర్లు అతుల్ కుమార్‌సింగ్ బృందం సభ్యులు సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆరా తీశారు. సంతోష్‌నగర్ కాలనీలోని వడ్డే గుంతను పరిశీలించారు. జెడ్పీహెచ్ఎస్ (హరిజనవాడ) పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ప్రసాద్ స్కీం పనులను పరిశీలించి వివరాలను దేవాలయ సిబ్బందితో అడిగి తెలుసుకున్నారు. వారి వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ, వార్డు అధికారులు, సిబ్బంది ఉన్నారు.

ఆదిశిలా క్షేత్రంలో భక్తుల పూజలు



ఆదిశిలా క్షేత్రంలో పూజలు చేస్తున్న భక్తులు

మల్దకల్: ఆదిశిలా క్షేత్రమైన స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు మధుసూదనాచారి, రమేషాచారి, రవిచారిలు స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. సద్దలోనిపల్లి కృష్ణస్వామి, పాల్వాయి అడవి ఆంజనేయస్వామి, కుర్తిరావులచెర్వు గట్టు తిమ్మప్పస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ఆలయాల్లో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆల య అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, అర్చకులు చంద్రశేఖర్ రావు, అరవిందరావు, నాగరాజుశర్మ, వాల్మీకి పూజారులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

5 నుంచి ఆరాధనోత్సవాలు



సద్గురు ఆదినారాయణస్వామి మూల విరాట్

శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పైపాడు మిట్టలపై వెలసిన సద్గురు ఆదినారాయణస్వామి 37వ వార్షిక ఆరాధనోత్సవాలు అక్టోబర్ 5 నుంచి ప్రారంభమవుతాయని పెద్దపుల్లయ్యస్వామి వారి శిష్యులు తెలిపారు. ఉదయం 10 గంటలకు పతాకావిష్కరణ, 11 గంటలకు పంచామృతాభిషేకం, 11.30 గంటలకు సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం, సాయంత్రం 5 గంటలకు సద్గురు ఆదినారాయణస్వామివారి ఛాయాచిత్రపటం కొంకల గ్రామం నుంచి పైపాడు ఆశ్రమం వరకు ఊరేగింపు నిర్వహించనున్నారు. 6న ఉదయం సుప్రభాతసేవ, 9 గంటల నుండి మహాత్ములతో ఉపన్యాసాలు, మధ్యాహ్నం 12.30 గంటలకు మహానైవేద్యం, మంగళహారతి, తీర్థప్రసాద వితరణ నిర్వహిస్తామని, ఆయా జిల్లాలకు చెందిన ఆదినారాయణస్వామివారి భక్త బృందం అందరు హాజరై గురువుగారి ఆశీర్వాదం పొందాలని శిష్యులు కోరారు.

కార్మికుల శ్రేయస్సే లక్ష్యం



327 యూనియన్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహిస్తున్న నాయకులు

గద్వాల అర్బన్: టీఎస్ఈఈ 327యూనియన్ 70ఏళ్లుగా కార్మికుల శ్రేయస్సే లక్ష్యంగా పనిచేస్తూ వారికి అండగా నిలుస్తోందని యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఉదయ్ కిరణ్, డివిజన్ సెక్రటరీ అశోక్ అన్నారు. 327యూనియన్ 70వ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఎస్సీ కార్యాలయం ఆవరణలో యూనియన్ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. 70ఏళ్లుగా ఐఎన్ టీసీ ఆల్‌ఇండియా అధ్యక్షుడిగా డాక్టర్ సంజీవరెడ్డి కొనసాగడం గర్వించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో ప్రసాద్, భాస్కర్, వెంకట్రాములు, మురళీ, నాగేష్, పరమేష్ తదితరులు ఉన్నారు.

గాలికుంటు టీకాలతో వ్యాధులు దూరం



తూర్పుగార్లపాడులో పాడి రైతులతో మాట్లాడుతున్న డాక్టర్ పుష్పలత

రాజోలి: గాలికుంటు టీకాల వల్ల పశువుల్లో కొన్ని రకాల వ్యాధులు నయం చేయవచ్చని డాక్టర్ పుష్పలత అన్నారు. శనివారం మండలంలోని మాన్‌దొడ్డి, తూర్పు గార్లపాడు గ్రామాల్లో 279 పశువులకు గాలికుంటు టీకాలు వేశారు. ప్రతిరైతు తమ పశువులకు టీకాలు వేయించాలని, ప్రస్తుత సీజన్‌లో పశువులకు కాలి గిట్టల మధ్య వచ్చే గాయాలు, జ్వరం రావడం గాలికుంటు వ్యాధి లక్షణాలని, ఈ వ్యాధి సోకిన పశువుల్లో పాల దిగుబడి తగ్గుతుందన్నారు. ముందస్తుగా నివారణ టీకాలు వేస్తున్నామని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది కార్తీక్, భాస్కర్, సతీష్, సురేష్, రాఘవేంద్ర, పాడి రైతులు పాల్గొన్నారు.

పాఠశాలలో మధ్యాహ్న భోజనం తనిఖీ



ఎస్ఏ ఎగ్జామ్స్ తీరును పరిశీలిస్తునన ఎంఈఓ



జీరబండలో రికార్డులను పరిశీలిస్తున్న పరిశీలిస్తున్న ఎంఈఓ రవీంద్ర బాబు

కేటీదొడ్డి: విద్యార్థులు మెరుగైన విద్యతో పాటు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈఓ వెంకటేశ్వర్‌రావు అన్నారు. శనివారం మండలంలోని గంగస్‌పల్లి, పాతపాలెం పాఠశాలలను ఆకస్మిక తనిఖీ నిర్వహించి రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం పరిశీలించి నాణ్యతపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. నందిన్నె పాఠశాలలోని ఎస్ఏ ఎగ్జామ్స్ జరుగుతున్న తీరును పరిశీలించి ఉపాధ్యాయులకు సమీక్ష సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఉమామహేశ్వర్, విజయభాస్కర్, చంద్రసేనారెడ్డి, తదితరులు ఉన్నారు.

పాఠశాలలను సందర్శించిన ఎంఈఓ..

ధరూరు: మండలంలోని ఆయా గ్రామాల్లో పాఠశాలలను శనివారం ఎంఈఓ రవీంద్రబాబు సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం, సుచి శుభ్రతపై ఆరా తీశారు. జీరబండ, నాగర్‌దొడ్డి, భీంపురం, చిన్నపాడు పాఠశాలల్లో రికార్డులను పరిశీలించారు. పాఠశాల అభివృద్ధి కోసం చేపట్టాల్సిన పనులపై చర్చించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉన్నారు.

రోడ్డుకు మరమ్మతు



అయిజ: మండలంలోని చిన్న తాండ్రపాడుకు చెందిన సుధాకర్ గౌడ్ సొంతఖర్చులతో గుంతలు పడిన రోడ్డుకు మరమ్మతు చేశారు. శనివారం అయిజ–చిన్న తాండ్రపాడు మధ్యనున్న రోడ్డుపై ఏర్పడిన గుంతలకు కంకర, డస్ట్ మిశ్రమాన్ని వేయించి శ్రమదానం చేసి పూడ్చాడు. కొన్ని సంవత్సరాలుగా సుధాకర్ గౌడ్ శ్రమదానం చేసి గుంతలు పడిన రోడ్లకు మరమ్మతులు చేస్తున్నాడు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల ప్రజలు ఆయనను అభినందించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ఎర్రవల్లి: మండలంలోని పుటాన్‌దొడ్డిలో శనివారం సీసీ రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ మాట్లాడుతూ గ్రామం నుంచి ఎర్రవల్లికి వెళ్లే దారిలో కల్వర్టు వరకు నూతనంగా రూ.5లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అల్లబకాష్, కృష్ణ, ఈదన్న, మహేష్, శ్రీరాములు, రవీంద్రబాబు, మాబు, నర్సింహ ఉన్నారు.

